సాక్షి
అనకాపల్లి
ఆదివారం ၊ 29 ၊ సెప్టెంబర్ ၊ 2024



'ఉక్కు'పై కూటమి తొండాట

కార్మికులను తొలగించిన ఆర్ఐఎన్ఎల్.. కార్మిక సంఘాల నిరసనలతో తలొగ్గింది. అయితే ప్రమాదం ఇంకా పొంచిఉంది. 8లో



టెట్ పరీక్షలకు ఏర్పాట్లు

వచ్చే నెల 3 నుంచి జరగనున్న టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష సమావేశంలో చెప్పారు. 8లో



విజిలెన్స్ అధికారిగా చిట్టిబాబు

విశాఖ సిటీ: ఏయూ విజిలెన్స్ అధికారిగా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు ఎన్.చిట్టిబాబు నియమితులయ్యారు.

కల్తీ నెయ్యి వాడినట్టు చంద్రబాబు నిరూపించాలి

- శాసనమండలి విపక్ష నేత బొత్స డిమాండ్



మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స, పక్కన మాజీ మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీ కాలనీ (విశాఖ): పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరూపించాలని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం లాసన్స్ బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తన స్వార్థ రాజకీయాల కోసం కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని సీఎం చంద్రబాబు పణంగా పెట్టారని ఆరోపించారు. దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగి తన నీచ రాజకీయ విధానాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. ఒక అబద్ధాన్ని ప్రజల్లో నమ్మించేందుకు చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయం అత్యంత దుర్మార్గమన్నారు. టీటీడీ ఈవో ఒక పక్క కల్తీ నెయ్యి వాడలేదని చెబుతున్నా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే కల్తీ వ్యవహారంపై థర్డ్ పార్టీ ఎంక్వయిరీ వెయ్యాలని, విచారణ కోసం సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేఐలకు లేఖలు రాయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వెంకన్న దర్శనానికి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఆయన కార్యక్రమానికి అనుమతులు లేవంటూ పోలీసు విభాగంతో నోటీసులు పంపించడమేంటని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి నుంచి డిక్లరేషన్ కోరడమేంటన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నోసార్లు శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో సైతం జగన్ శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తుచేశారు. ఇతర మతాల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకే చంద్రబాబు ఈ తరహా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు.

చంద్రబాబు తరహాలో హోంమంత్రి పచ్చి అబద్ధాలు



ఎమ్మెల్సీ కల్యాణి

సీతమ్మధార (విశాఖ): హోం మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నానన్న విషయం మర్చిపోయిన వంగలపూడి అనిత.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దారుణ విమర్శలు చేస్తున్నారని, అది అత్యంత హేయమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. అనిత గతి తప్పి, జగన్‌పై పిచ్చి వ్యాఖ్యలు, విమర్శలు చేస్తున్నారని, ఆమె అబద్ధాలు ఎల్లకాలం కొనసాగవని, ఎప్పటికైనా పరిహారం తప్పదన్నారు. పెదవాల్తేరులోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో ఆమె మాట్లాడారు. చంద్రబాబు తరహాలో హోం మంత్రి కూడా పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, టీటీడీ లడ్డూపై ఆరోపణల్లో చంద్రబాబే దోషిగా తేలిందని పేర్కొన్నారు.



మాడుగుల వేంకటేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన ధర్మశ్రీ



నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

కలియుగ దైవంతో క్షుద్ర రాజకీయాలా...

సనాతన ధర్మానికి కూటమి ప్రభుత్వం విఘాతం కలిగిస్తోంది. క్షుద్ర రాజకీయాలు, అబద్ధాలతో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పట్ల తీవ్ర అపచారం చేసింది. కల్తీ నెయ్యి ఆరోపణలుచేస్తూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాస్తవాలను పక్కదారి పట్టించింది. దీంతో జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు రగిలిపోతున్నారు. నిరంకుశపాలన ఎక్కువ కాలం సాగదని శాపనార్థాలు పెడుతున్నారు. చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు చేశారు.

- తిరుపతి వెంకన్నను రాజకీయాల్లోకి లాగడం అన్యాయం
- లడ్డు ప్రసాదం కల్తీ జరిగిందంటూ సీఎం చంద్రబాబు నిరాధర ఆరోపణలు
- మనోభావాలను దెబ్బతీశారంటూ సర్వత్రా భక్తుల ఆందోళన
- చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం జిల్లా వ్యాప్తంగా పూజలు

సాక్షి న్యూస్ నెట్‌వర్క్:

తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్న కూటమి నాయకుల పాపాలను ప్రక్షాళన చేయాలని ఆ వేంకటేశ్వర స్వామిని వేడుకుంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు జిల్లా అంతటా దేవాలయాల్లో ప్రార్థనలు జరిపారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో శనివారం మాడుగుల వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ, రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన దుర్గాదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించి మంచి జరగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, రెడ్డి జగన్‌మోహన్, కురచ జయమ్మ, జెడ్పీటీసీలు లాలం శారద, కిముడు రమణమ్మ పాల్గొన్నారు.

చోడవరంలో..

పవిత్రమైన తిరుపతి లడ్డూ తయారీ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబునాయుడు రాజకీయం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం పవిత్ర పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుమలను కలుషితం చేసే కుట్రకు చంద్రబాబు తెరతీశారని, ఆయనకు ప్రజలకు బుద్ధి చెబుతారన్నారు. రాజశేఖరరెడ్డి హయాంలో వేదపాఠశాలలు నిర్మించారని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జమ్మూకాశ్మీర్, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించారన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయంలో..

మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగుల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉపమాక వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. ముందుగా ప్రధాన రాజగోపురం ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. గోవిందనామస్మరణ చేస్తూ బేడామండపం చుట్టు ప్రదక్షిణలు జరిపారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులు క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఇసరపు పార్వతి పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాలుగు నెలల కాలంలో ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని, హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు వేంకటేశ్వరస్వామి లడ్డూను తెరపైకి తెచ్చారని గణేష్ విమర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, ఎంపీపీలు గజ్జలపు మణికుమారి, రుత్తల లక్ష్మి, సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

యలమంచిలిలో..

మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండలం వెదురువాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డూ తయారీలో ఎటువంటి తప్పులు జరగలేదని భక్తులు సైతం చెబుతున్నారన్నారు. కావాలని జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎంపీపీ కోన సంధ్య, జెడ్పీటీసీ లాలం రాంబాబు పాల్గొన్నారు. మునగపాక మండలం నాగులాపల్లిలో, రాంబిల్లిలోని రామాలయంలో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూపర్ సిక్స్ పథకాలు గోవిందా

కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు గోవిందా.. అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. అనకాపల్లిలోని రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ గోవిందా... గోవింద.. అంటూ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని నిర్వహించారు. గాంధీనగరంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.



ఉపమాక వెంకన్న సన్నిధిలో పూజలు చేస్తున్న పార్టీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోజులు



అనకాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



అచ్యుతాపురం మండలం వెదురువాడ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

డైవర్ట్ పాలి'ట్రిక్స్' వద్దు బాబూ

- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు పరమ పవిత్రమైన తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హితవు పలికారు. శనివారం మాడుగుల వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాజకీయంగా బురద జల్లే విధంగా కూటమి నాయకులు మాట్లాడడం విచారకరమన్నారు. అధికారులు ఒకలా చెబితే.. చంద్రబాబు మరోలా చెబుతున్నారని, జూలై 23వ తేదీనే రిపోర్టు వస్తే ఇప్పటి వరకు ప్రస్తావించకపోవడం గమనార్హమన్నారు. 100 రోజుల కూటమి పాలన పూర్తిగా విఫలమైందని ప్రజలే చెప్పుకుంటున్నారన్నారు. తాము గడప గడపకు వెళ్లి పార్టీలతీతంగా పథకాలు అందజేశామని, సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తిరుపతి వేంకటేశ్వరుడిని దర్శించాలని జగన్‌మోహన్‌రెడ్డి అనుకుంటే.. అక్కడ అడ్డగోలుగా అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. దానిని ముందే గుర్తించి ప్రజలను ఇబ్బంది పెట్టరాదని, భక్తుల మనోభావాలు దెబ్బతీయరాదని, ఒక అడుగు వెనక్కు తీసుకుని వైఎస్ జగన్ తిరుపతి పర్యటన విరమించుకున్నారన్నారు.

ఇది నిరంతర ప్రక్రియే..

తిరుపతిలో టీడీపీ హయాంలో కూడా అనేక నెయ్యి ట్యాంకర్లు వెనక్కి పంపడం జరిగిందని, ఇప్పుడు కూడా వచ్చిన నాలుగు ట్యాంకర్లు వెనక్కు వెళ్లాయని అధికారులు చెబుతుంటే తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ముత్యాలనాయుడు అన్నారు. విశిష్టమైన ప్రసాదంపై చేసిన తప్పుడు ఆరోపణలతో ప్రపంచంలో అనేక దేశాల నుంచి వస్తున్న భక్తులు మనోభావాలు దెబ్బతింటాయన్నారు. తప్పు జరిగితే సుప్రీంకోర్టు మాజీ జడ్జిని కమిటీ చైర్మన్‌గా నియమించి విచారణ చేపట్టాలని, లేదా సీబీఐ దర్యాప్తు చేపట్టి నిజం నిరూపించాలని, జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లరాదని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టే ముందు, తర్వాత కూడా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారని గుర్తుచేశారు. తాను కీలకమైన ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న కాలంలో మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టానని, సమస్యలను పరిష్కరించుకుంటూ ఈ ప్రాంతాన్ని ఉన్నతంగా దీర్చిదిద్దానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వసతిగృహాలను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



విద్యార్థినితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు నర్సీపట్నం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ శనివారం బీసీ, ఎస్సీ, వసతిగృహాలు, బాలసదనాన్ని సందర్శించారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలపై న్యాయమూర్తి ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి సంక్షేమాధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి వెంట ఎంఈవో నాగేంద్రబాబు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

30న రైఫిల్ షూటింగ్, వుషూ పోటీలు

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు ఈనెల 30న పరవాడ గ్రామంలో సాంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో రైఫిల్ షూటింగ్, వుషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14, 17 ఏళ్ల బాలబాలికలకు రైఫిల్ షూటింగ్, 17 ఏళ్ల బాలబాలికలకు వుషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి వచ్చే నెల 1వ తేదీన ఎస్.రాయవరం మండలం పెద్దగుమ్ములూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

వాడిగావేడిగా గోవాడ సుగర్స్ మహాజన సభ





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే రాజు, సభకు హాజరైన రైతులు

- గిట్టుబాటు ధరపైనే ప్రధానంగా చెరకు రైతుల డిమాండ్
- టన్నుకు రూ.3600 ఇవ్వాలన్న బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ
- ఫ్యాక్టరీ అభివృద్ధికి సలహా మండలి వేయాలని తీర్మానం
- ఈ ఏడాది టన్నుకు రూ.3151 మద్దతు ధర ప్రకటించిన కలెక్టర్ విజయ కృష్ణన్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభ వాడిగా వేడిగా జరిగింది. గిట్టుబాటు ధర, ఫ్యాక్టరీ అభివృద్ధి పైనే ప్రధానంగా చర్చించారు. గిట్టుబాటు ధర ఆశించిన మేర ఇవ్వకపోతే చెరకు సాగు చేయడం కష్టమని రైతులు స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ చైర్‌పర్సన్, కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన సభ జరిగింది. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు వార్షిక నివేదికను చదివి వినిపించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సభ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, వేలాది మంది రైతులు పాల్గొని వారి సమస్యలు చెప్పుకున్నారు. ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడం లేదని, గిట్టుబాటు ధర కల్పించాలని, ఫ్యాక్టరీ ఆడిట్ రిపోర్టులో చూపిన లోపాలు, అవినీతిపై విచారణ కమిటీ వేయాలని బి. సింహాచలం అనే రైతు డిమాండ్ చేశారు. గోవాడ ఫ్యాక్టరీలో జరిగిన అవినీతిపై 51 విచారణ వివరాలు వెల్లడించి, చర్యలు తీసుకోవాలని రైతు శిరిగిరిశెట్టి చిన్నయ్యదొర డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఫ్యాక్టరీకి ఆర్థిక సాయం చేసేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అది కొనసాగించాలని రైతు బూరే బాబూరావు కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టన్నుకు రూ. 3600 నుంచి రూ.4 వేలు వరకూ చెరకు మద్దతు ధర ఇవ్వాలని రైతు తనకల జగన్ డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెరిగిన రీత్యా టన్నుకు కనీసం రూ.3,600 అయినా చెల్లించేలా అధికారపార్టీ ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు కోరారు. టన్నుకు రూ. 3500 దాటి ఇచ్చేలా స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సీఎంకు, డిప్యూటీ సీఎంకు తెలియజేస్తామని జనసేన సమన్వయకర్త పీవీఎస్ఎన్‌రాజు చెప్పారు.

రైతులకు అవగాహన కల్పించాలి: ముత్యాలనాయుడు

రైతులకు మద్దతు ధర కల్పించడంతోపాటు ఫ్యాక్టరీలో ఉప ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఫ్యాక్టరీకి సుమారు రూ.81 కోట్లు అందజేశామన్నారు. అయితే అంతకుముందు టీడీపీ పాలకవర్గం చేసిన అప్పులు, రైతులకు చెల్లించాల్సిన పాత చెరకు బకాయిలు తీర్చడానికి ఆ నిధులు సరిపోయాయన్నారు. ఇథనాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు రూ.102 కోట్లతో ప్రతిపాదనను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పుడేమో స్థానిక ఎమ్మెల్యే డిస్టలరీ పరిశ్రమ పెడతామంటున్నారని, ఈ రెండు పరిశ్రమలు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫ్యాక్టరీ అభివృద్ధికి గ్రాంట్ తీసుకురావాలని ఆయన కోరారు. కొత్త చెరకు వంగడాలను తెచ్చి రైతులకు అవగాహన కల్పించి, దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జగనన్నతోనే చెరకు రైతులకు భరోసా : ధర్మశ్రీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెరకు రైతులకు అండగా నిలిచారన్నారు. రూ.170 కోట్లు అప్పుల్లో కూరుకుపోయిన గోవాడ ఫ్యాక్టరీకి రూ.82 కోట్లు వివిధ రూపాల్లో గ్రాంట్ ఇచ్చి ఆదుకోవడంతో పాటు రైతులకు చెరకు బకాయిలు తీర్చారని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. అదే మాదిరిగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఫ్యాక్టరీని, రైతులను ఆదుకునేందుకు అవసరమైన గ్రాంట్‌ను ఏటా తీసుకురావడానికి చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కృషి చేయాలన్నారు.

గత సర్కారు మాదిరిగానే గ్రాంట్ తెస్తాం:ఎమ్మెల్యే రాజు

చెరకు రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రితో మాట్లాడి గ్రాంట్ తేవడానికి కృషి చేస్తానని అధికార పార్టీకి చెందిన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సభాముఖంగా హామీ ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోరూ.80 కోట్ల మేర గ్రాంట్ తెచ్చి ఫ్యాక్టరీని ఆదుకుందని, ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో కూడా గ్రాంట్ తెచ్చి ఫ్యాక్టరీని, రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు.

చెరకు టన్నుకు రూ. 3151 ఇస్తాం: కలెక్టర్ విజయ కృష్ణన్

టన్నుకు రూ. 3151గా ఈ ఏడాది మద్దతు ధర ఇస్తున్నామని ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జి, కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రకటించారు. మహాజనసభలు రైతులు చెప్పిన సూచనలు, డిమాండ్లపై చర్యలు తీసుకుంటామన్నారు. టన్నుకు రూ. 3600 ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రభుత్వానికి పంపిస్తామని ఆమె చెప్పారు.

తీర్మానాలు: 2022–23 సీజన్ లెక్కలు, 2023–24 క్రషింగ్ సీజన్‌కు సంబంధించిన ఆదాయ వ్యయాలకు సంబంధించిన బడ్జెట్‌పై ఆమోదం తెలిపారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి సలహామండలి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని తీర్మానించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్టీవో మనోహర్

తుమ్మపాల: రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. బ్లాక్ స్పాట్‌లలో లైటింగ్, బోర్డ్స్, సిగ్నల్ ఏర్పాట్లు చేశామన్నారు. అయితే తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలన్నారు. సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే, ట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి లంకెలపాలెం, నక్కపల్లి జంక్షన్లను జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. జిల్లా రవాణా అధికారి మనోహర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివేదిక తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్, పోలీస్, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

‘ఉక్కు’పై కూటమి తొండాట

- 4 వేల మంది కార్మికులను తొలగించిన ఆర్ఐఎన్ఎల్
- కార్మిక సంఘాల నిరసనలతో తలొగ్గిన యాజమాన్యం
- ఒకేసారి తొలగించొద్దంటూ బుజ్జగించిన కూటమి ప్రభుత్వం
- విడతల వారీగా తొలగిస్తే ఇబ్బందులుండవని చెప్పినట్లు సమాచారం
- ఎప్పటికప్పుడు కార్మిక సంఘాల్ని మభ్యపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉత్పత్తి లేనప్పుడు ఉద్యోగులెందుకంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలు

సాక్షి, విశాఖపట్నం: తెలుగు ప్రజల ఆత్మగౌరవం విశాఖ స్టీల్‌ప్లాంట్. ప్లాంట్‌ను కాపాడతామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ప్లాంట్ నిర్వీర్యం అవుతుంటే చేష్టలుడిగి చూస్తోంది. స్ట్రాటజిక్ సేల్ పేరిట ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు కేంద్రం వేస్తున్న అడుగులకు రాష్ట్ర ప్రభుత్వం మడుగులొత్తుతోంది. నాలుగు వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ రచ్చరచ్చ కావడంతో ఉక్కు యాజమాన్యం వెనక్కి తగ్గింది. ఈ నిర్ణయం తాత్కాలికమేనని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలు జరగొచ్చనే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. కాగా.. దీని వెనక కూటమి ప్రభుత్వం కుయుక్తి ఉందని తెలుస్తోంది. ఒకే సారి తొలగిస్తే ఉద్యమాలు ఉధృతమవుతాయని.. విడతల వారీగా తొలగించాలని సూచించినట్లు సమాచారం. ఒకవైపు కార్మిక సంఘాలు, కార్మికులను మభ్యపెడుతూ.. మరోవైపు ప్రైవేటీకరణ చర్యలను ముమ్మరం చేసిన కేంద్ర ప్రభుత్వానికి అడ్డు చెప్పకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు ప్రస్తుత పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధులకు రాకుండా ఆపేసింది. మొత్తం 14 వేల మంది ఉద్యోగులు, కార్మికుల్లో ఒక్కసారిగా 4 వేల మందిని తొలగించేందుకు చర్యలు చేపట్టడంతో అందరిలోనూ ఆందోళన మొదలైంది. ఈ వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉలిక్కి పడింది. ఈ వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుందని తెలుసుకుని ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపింది. అయితే కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపును పూర్తిగా నిలిపివేయాలని కోరలేదని తెలిసింది. ప్రస్తుతానికి అందరినీ విధుల్లోకి తీసుకోవాలని.. వీలు చూసుకుని తగ్గింపు ప్రక్రియ చేపట్టాలని



బుజ్జగించినట్లు సమాచారం. ఇలా పెద్ద మొత్తంలో ఒకేసారి తొలగిస్తే తమకు చెడ్డపేరు వస్తుందని అన్నట్లు తెలిసింది.

వేలాడుతున్న ‘తొలగింపు’కత్తి

అధికారుల చర్చల అనంతరం తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి ఎల్లో కలర్ పాస్ ఉంటుంది. వీరిని ఆన్‌లైన్‌లో తొలగించడంతో మొత్తం ఆన్‌లైన్ చేయడానికి మరో 3 లేదా 4 రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకు మాన్యువల్‌గా ఎంట్రీ చేసి విధులకు పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే నాలుగు రోజుల తర్వాత పాస్‌ను వేరే రంగులో జారీ చేయాలని యాజమాన్యం ఆదేశించింది. అంటే వీరిని టెంపరరీ వర్కర్లుగానే గుర్తించేలా కుయుక్తులు పన్నుతోంది. భవిష్యత్‌లో ఉద్యోగులను తొలగించాల్సి వస్తే.. వీరినే ముందుగా బలిపశువులు చేయాలని యాజమాన్యం ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

నాలుగేళ్లు నిలువరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2020 నుంచి స్టీల్‌ప్లాంట్‌కు సరైన ప్రాధాన్యమివ్వకుండా కేంద్రం విస్మరించడంతో.. ప్లాంట్ పతనం మళ్లీ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇందుకోసం నియమించిన కేబినెట్ కమిటీ నివేదిక అనంతరం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సబ్సిడరీస్ లేదా జాయింట్ వెంచర్స్ ఉంటే వాటిని కూడా వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేసింది. 2023లో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ బిడ్స్‌ను సైతం ఆహ్వానించింది. ఇలా ఎప్పటికప్పుడు ‘ఉక్కు’ఊపిరి తీసేందుకు కేంద్రం ప్రయత్నించింది. అయితే ఈ చర్యలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు విజయవంతంగా అడ్డుకుంది. ఫలితంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రైవేటీకరణ చర్యలు ఊపందుకున్నాయి.

కేంద్ర మంత్రి అహంకారపూరిత వ్యాఖ్యలు

నాలుగు వేల మంది ఉక్కు ఉద్యోగుల తొలగింపు వ్యవహారంపై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకే పని లేక ఖాళీగా ఉన్నారంటూ ఢిల్లీలో మీడియాతో వ్యాఖ్యానించారు. ప్లాంట్ నష్టాలను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్యాకేజీలు ఇవ్వలేదని తేల్చి చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తక్కువ.. కార్మికులు ఎక్కువైపోయారని.. పర్మినెంట్ ఉద్యోగులకే పనిలేదంటూ మాట్లాడారు. ఉత్పత్తి లేకపోయినా కార్మికులను కొనసాగించడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సెయిల్ ఆధ్వర్యంలో నడుస్తున్న అనేక ఉక్కు పరిశ్రమలు లాభాల బాటలో నడుస్తుంటే.. స్టీల్‌ప్లాంట్ మాత్రం కొన్నేళ్లుగా నష్టాల్లో నడుస్తోందని వ్యాఖ్యలు చేశారు. నష్టాలను భరించే శక్తి పదే పదే కేంద్రానికి ఉండదన్నారు. ఎంత మంది ఉద్యోగులున్నారు? ఎంత ఉత్పత్తి అవుతోంది? అనే వాస్తవాలు తన దగ్గర ఉన్నాయంటూ కేంద్ర మంత్రి పరుషంగా చేసిన వ్యాఖ్యలు ఉద్యోగ, కార్మిక సంఘాల్లో దుమారం రేపుతున్నాయి. సెయిల్ ఆధ్వర్యంలో 8 యూనిట్లుంటే అల్లాయ్ దుర్గాపూర్, సేలమ్ ప్లాంట్, వీఐఎస్ఎల్ భద్రావతి దశాబ్దాలుగా నష్టాల్లో ఉన్నాయని.. బిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా ప్లాంట్స్ మాత్రమే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో లాభాల్లో ఉన్నాయన్న విషయం కేంద్ర మంత్రికి తెలీదా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు స్టీల్‌ప్లాంట్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరికి సొంతిల్లు అందించటమే లక్ష్యం



లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమం చేపడుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మండలంలో మారేడుపూడి గ్రామంలో చేపట్టిన మన ఇల్లు– మన గౌరవం కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు నీరు, విద్యుత్ సమస్య ఉన్నట్లు లబ్ధిదారులు ఆమెకు తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. స్థలం మంజూరు చేసినప్పటికీ సమస్యలు అధికంగా ఉండటంతో నిర్మాణాలు చేయలేని పరిస్థితిని ఆమె పరిశీలించారు. వారంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజన్‌అధికారి చిన్నికృష్ణ, డీటీ శ్రీరామ్మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘం అవకతవకలపై మళ్లీ విచారణ

రోలుగుంట : మండలంలో జానకీరాంపురం సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై మలివిడత విచారణ శనివారం నిర్వహించారు. సహకార శాఖ నర్సీపట్నం సీనియర్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. మరిడయ్య సొసైటీకి వచ్చి విచారణ చేపట్టారు. పీఏసీఎస్‌లో చోటు చేసుకున్న అక్రమాలపై కలెక్టర్‌కు పలువురు రైతులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెల 21న మొదటి దఫా విచారణ నిర్వహించారు. శనివారం మరో పర్యాయం విచారణ చేపట్టి పలు రికార్డులు పరిశీలించారు. రైతుల్లో కొంత మంది తాము రుణాలు తీసుకోకపోయినా తమ పేరిట రుణాలు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందని, తీసుకోని రుణాలు తామెలా చెల్లిస్తామని విచారణ అధికారికి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అధికారి మరిడయ్య తెలిపారు.

పిల్లలూ.. మీకు రక్షణగా చట్టాలున్నాయి

- ఏ సమస్య ఉన్నా మాకు చెప్పండి
- సీనియర్ సివిల్ జడ్జి విజయ



వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: పిల్లలూ మీకు ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురండి.. ఆ సమస్యను పరిష్కరించి మీరు బాగా చదువుకునేందుకు అండగా ఉంటాం.. అంటూ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ బాలికలకు భరోసా ఇచ్చారు. పట్టణంలోని కొత్తపేట వీధిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆమె శనివారం రాత్రి తనిఖీ చేశారు. ఇక్కడ వసతి పొందుతున్న బాలికలతో సమావేశమయ్యారు. వేధింపులు, భోజనం సక్రమంగా పెట్టకపోవడం, చదువుకోవడానికి ఆటంకం కల్పించడం వంటి సమస్యలుంటే తల్లిదండ్రులకు గానీ, తమకు గానీ తెలియజేయాలని సూచించారు. బాలికలకు అవసరమైన చట్టాలపై ఆమె వారికి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినుల పడక గదులు, కిచెన్, స్టోర్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. స్నానపు గదుల్లో కొన్నింటికి తలుపులు లేకపోవడం, మరికొన్ని తుప్పు పట్టి సగమే ఉండడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట లోక్‌అదాలత్ సభ్యులు డి.వెంకట్రావు, పీవీ రమణ, ప్యానల్ లాయర్ బి.హరిశంకర్రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రైతు మేళా



రైతు మేళాను ప్రారంభిస్తున్న జలగం కుమారస్వామి

తుమ్మపాల : రైతు ఉత్పత్తులు వారే విక్రయించుకునేందుకు రైతు మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని భారతీయ కిసాన్ సంగ్ ప్రధాన కార్యదర్శి జలగం కుమారస్వామి అన్నారు. పట్టణంలో వి.వి. రమణ రైతు భారతి కళామందిర్‌లో శనివారం అత్యంత ఉత్సాహంగా రైతు మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎఫ్‌పీవో, ఎఫ్‌పీసీలుగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో తమ ఉత్పత్తులను ప్రదర్శించి అమ్ముకోవడం ద్వారా ఆర్థికంగా బలపడతారన్నారు. ఈ సందర్భంగా పలువురు స్టాళ్లను సందర్శించి నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేశారు. రెండు రోజులు జరిగే ఈ మేళాకు ప్రతి ఒక్కరు వచ్చి రైతు ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కుమారస్వామి పిలుపునిచ్చారు. ఇటువంటి రైతు మేళాల ద్వారా అందరికీ నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండడమే కాకుండా దళారీలు లేకుండా నేరుగా రైతులకే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. విశాఖ, విజయనగరం -4, శ్రీకాకుళం-2, తూర్పుగోదావరి-1తో పాటు జిల్లాలో 8 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ బీవీ శ్రీరామ్‌మూర్తి, సీనియర్ సైంటిస్ట్ కె.శైలజ, విశాఖపట్నం మిద్దె తోటల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యంవర్మ, అగ్రికల్చర్ సైంటిస్ట్ కె.అశోక్ కుమార్, భారతీయ విద్యా కేంద్రం అధ్యక్షుడు రాపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముత్యాలనాయుడికి ధర్మశ్రీ అభినందన



బూడి ముత్యాలనాయుడిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అభినందించారు. శనివారం చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చిన బూడిని స్థానిక పార్టీ నాయకులు, ధర్మశ్రీ అభినందించారు. శాలువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ధర్మశ్రీ చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు ముత్యాలనాయుడు సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మూడేళ్ల శంకరరావు, ఓరుగంటి నెహ్రూ, సన్ని పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడు ‘బూడి’కి ఘన స్వాగతం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడిని సత్కరిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి మాడుగుల వచ్చిన బూడి ముత్యాల నాయుడుకు నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు మాడుగులలో శనివారం ఉదయం ఘన స్వాగతం పలికి సత్కరించారు. జై జగన్, జై బూడి అంటూ పెద్ద ఎత్తున మాడుగుల దద్దరిల్లేలా నినాదాలు చేశారు. నిబద్ధత ఉన్న నాయకుడిని జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ సేనాపతి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పుట్టా మురళి, పడాల అప్పలనాయుడు, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, కాళ్ల రాము, గురునాయుడు, పత్రే రాము నాయుడు, శోలం తరమేష్, శీలామంతుల వాసు, తాళ్లపురెడ్డి రాంబాబు, అల్లంగి సంజీబు, శ్రీనాదు జగ్గారావు, గోకేడ అప్పలనాయుడు, కాత వెంకటరమణ, తలారి అప్పారావు, ఎడ్ల హేమంత్, కె. గోపాల్, సయ్యపురెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం



తోటాడలో అనాథ మృతదేహాన్ని ఖననం చేస్తున్న మానవతావాదులు

మునగపాక : పక్కోడు ఏమైపోతే నాకెందుకులే అనుకునే రోజుల్లో ఎవరో తెలియని వ్యక్తిని ఖననం చేసిన సంఘటన తోటాడలో చోటు చేసుకుంది. మండలంలోని తోటాడలో అనాథ మృతదేహానికి శనివారం కొంత మంది మానవతావాదులు ముందుకొచ్చి ఖననం చేశారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో మహిళ భిక్షమెత్తుకుంటూ జీవిస్తుండేది. కాగా శనివారం ఆమె మృతి చెంది ఉండడాన్ని గమనించిన కొంత మంది ముందుకు వచ్చి ఆమెను తోటాడ శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన కొత్తలంక వీరబాబు, కొత్తలంక సత్యకుమార్, ఈదలపాక కృష్ణ, కొత్తలంక రాజును పలువురు అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో రమణ



నర్సీపట్నం : ఆర్డీవోగా వి.వి. రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొండ ఆర్డీవోగా పని చేస్తూ బదిలీపై ఆయన వచ్చారు. కార్యాలయ ఏవో సూర్యనారాయణ, సిబ్బంది, డివిజన్‌లోని తహసీల్దార్లు ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

టెట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మహారాణిపేట (విశాఖ): జిల్లాలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలోని ఒక కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వచ్చే అభ్యర్థులను ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించి కేంద్రంలోకి అనుమతించాలన్నారు. దివ్యాంగులు కోసం పరీక్ష సమయానికి అదనంగా 50 నిముషాల కేటాయించాలన్నారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తి కోసం ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు.

చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామి



గాంధీనగరం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు



రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయానికి బైక్ ర్యాలీగా వెళ్తున్న భరత్‌కుమార్



గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయ బయట మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక లడ్డూపై దుష్ప్రచారం
- ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కుట్రలు
- తిరుమల వెంకన్న తగిన బుద్ధి చెప్పుతాడు
- ఆలయంలో నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ పూజలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు గోవిందా...గోవింద.. అంటు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ సూపర్ సిక్స్ పథకాలు గోవిందా...గోవింద.. అంటూ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరుపతి లడ్డూ విశిష్టతను దెబ్బతీసిన చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ గాంధీనగరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భరత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రలు పన్నుతూ తిరుమల లడ్డూ విషయంలో దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల



పూజలు చేస్తున్న నాయుడు, కార్యకర్తలు

పాలనలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతుందన్నారు. దీని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుమల లడ్డూను తెరపైకి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోవడంతో చంద్రబాబునాయుడు తట్టుకోలేక తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

తిరుమల వేంకటేశ్వరస్వామి చంద్రబాబునాయుడుకు సద్బుద్ధి ప్రసాదించి, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వేంకటేశ్వరస్వామికి పూజలు చేసినట్లు పేర్కొన్నారు. లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లుగా పది రోజులుగా ఎల్లో మీడియా ప్రచారం చేయడం మానుకోవాలని హితవుపలికారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రమే కల్తీ నెయ్యి లారీ తిరుమలకు వచ్చిందన్నారు. ఆ లారీ వెనక్కి పంపించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారి శ్యామలరావు, సిబ్బంది చెబుతుంటే, చంద్రబాబునాయుడు నెయ్యిలో కల్తీ జరిగినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి పాలనలోనే తిరుమలకు కల్తీ నెయ్యి వచ్చిందని పేర్కొన్నారు. వేంకటేశ్వరస్వామి లడ్డూను రాజకీయం చేయడం చంద్రబాబునాయుడు దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తల్లికి వందనం గోవిందా... అన్నదాన సుఖీభవ పథకం గోవిందా.. ప్రతీ ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు గోవిందా... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గోవిందా... అయ్యిందని ఎద్దేవా చేశారు. అలవికాని సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజలతో ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. తిరుమల దర్శనానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం చెప్పడం తగదన్నారు.

వంద రోజుల కూటమి పాలనతో ప్రజలు విరక్తి చెందుతున్నారని, 2029తో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు జోష్యం చెప్పారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించడంలో చంద్రబాబునాయుడు దిట్టన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలైలో తిరుమలకు కల్తీ నెయ్యి వచ్చినట్లు నిర్ధారణ జరిగితే, ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం సిగ్గుచేటన్నారు. కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకురావడం జరిగిందన్నారు. 14 మాసాలు రాష్ట్ర వ్యాప్తంగా 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన జగన్‌మోహన్‌రెడ్డి అనంతరం తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి పట్టువస్త్రాలు పట్టుకుని వెళ్లి దర్శనం చేసుకున్నప్పుడు లేని డిక్లరేషన్ కూటమి ప్రభుత్వానికి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. త్వరలో వేంకటేశ్వర స్వామి చంద్రబాబునాయుడుకు తగిన శిక్ష వేస్తారని చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి ఉద్యమాలు చేయడం దేశ చరిత్రలో మొదటిసారన్నారు. ప్రజల పక్షాన ప్రతిపక్షాలు నిలబడతాయని, రాష్ట్రంలో మతాలు, కులాలు మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ కార్యదర్శి కుండల రామకృష్ణ, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ నాయకులు కడిమిశెట్టి సతీష్, ఎం.శ్రీనివాసరావు, ఉగ్గిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గవరపాలెంలో..

80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు ఆధ్వర్యంలో గవరపాలెం చిన్న రామస్వామి కోవెల వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వజ్ర కవచంతోపాటు వివిధ రకాల పూల దండలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా సీతారామ మహిళా సేవా సంఘ వార్షికోత్సవం



భజనలు చేస్తున్న మహిళలు

తుమ్మపాల: జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు సర్సింగరావుపేట రామాలయంలో సీతారామ మహిళా సేవా సంఘం పదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక కార్యదర్శి సూచికొండ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ విచ్చేసి సంఘ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం స్థలం పది సెంట్లు కేటాయించేలా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు రామాలయంలో సీతారాముల భజనలు చేశారు. ప్రభుత్వ పాఠశాల కమిటీ చైర్మన్ కసిరెడ్డి అప్పలకొండ, సంఘ గౌరవ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరావు, అధ్యక్షులు కసిరెడ్డి సుశీల, బల్లిన నాగమణి, కోశాధికారి కావలి వరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

రేపటిలోగా పన్నులు చెల్లించాలి

అనకాపల్లి: జోన్ పరిధిలో 2024–25 మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, ఆస్తి, కుళాయి పన్నులు ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని జెడ్సీ ఓ.అయ్యప్పనాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్నులు బకాయిలు ఉన్న వ్యక్తులు సకాలంలో ప్రభుత్వానికి చెల్లించి, జోన్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

రేపు పీఏసీఎస్ సమావేశం

అనకాపల్లి: స్థానిక గాంధీనగరంలో ది తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (అన్నపూర్ణ బ్యాంక్) మహాజన సభ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ అఫీషియల్ పర్సనల్ ఇన్‌చార్జి వి.వి.వి.సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 121 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,860	5.070
రెండో రకం	3,650	3,850
మూడోరకం	3,200	3,300

అనకాపల్లి సినిమాలు

దేవర : రాజా
మత్తు వదలరా 2 : సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2 : సత్యనారాయణ స్క్రీన్-2
దేవర : పర్తిసాయి
దేవర : వెంకటేశ్వర
దేవర : రామచంద్ర
సత్యం సుందరం : షిర్డీసాయి
ప్రేమికుడు : శ్రీసత్య

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–2 యూనిట్, బీ పాజిటివ్–18 యూనిట్లు, ఓ పాజిటివ్–8 యూనిట్లు, ఏబీ పాటిజివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 386 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె వాయిదా

తుమ్మపాల: ఈ నెల 30 నుంచి జరగాల్సిన ప్రభుత్వ ఆస్పత్రుల శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్‌వైజర్ కార్మికులు సమ్మె వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో డీసీహెచ్ శ్రీనివాస్‌తో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, కార్మిక సంఘం నాయకులతో శనివారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ సమ్మె వాయిదా పడినప్పటికీ నల్ల బ్యాడ్జీలతో నిరసనలు జరుగుతాయన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు సమయం కావాలని అధికారుల సూచనకు కార్మిక సంఘం నాయకులు అంగీకారం తెలిపారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ గడువులోగా కార్మికులు సమస్యలు పరిష్కారం కాకపోతే 6వ తేదీ తర్వాత జిల్లా వ్యాప్తంగా సమ్మె తప్పదన్నారు. కార్మిక సంఘాల నాయకులు సంతోష్, వరప్రసాద్, చంద్రకళ, పార్వతి, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాలస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు రంగనాథాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

36 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కశింకోట: హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక గవరపేటలో వెల్‌నెస్ సెంటర్ వద్ద క్యాన్సర్‌పై ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు శనివారం నిర్వహించారు.

అగనంపూడి ఆస్పత్రి నుంచి వైద్యులు సమిత, హరిప్రియ హాజరై 36 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీరిలో అధికంగా 28 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్ విభాగాల్లో పరీక్షలు జరిగాయి. కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గా, ఏఎన్‌ఎం నిర్మల, సిబ్బంది సహకారం అందించారు.

తాళ్లపాలెంలో సామూహిక సీమంతాలు



గర్భిణులను ఆశీర్వదిస్తున్న సీడీపీవో ప్రభావతి

కశింకోట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తాళ్లపాలెం కల్యాణ మండపంలో సామూహిక సీమంతాలు శనివారం నిర్వహించారు. తాళ్లపాలెం సెక్టార్ పరిధిలో 23 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గర్భిణులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి వారికి చీరలు, ఇతర సామగ్రి అందజేసి ఆశీర్వదించారు. పండంటి బిడ్డలను కనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాయల మురళీధర్, బుదిరెడ్డి చిన్న, కర్రి వెంకటసత్యనారాయణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్డ సంచుల పంపిణీ



బయ్యవరం హైస్కూలు ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



క్లాత్ సంచులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కశింకోట: స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో శనివారం బయ్యవరం హైస్కూలులో విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం సునీత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎ.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు సారధి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గౌరీ పీఏసీఎస్ సభ్యుల డివిడెంట్ 7.5 శాతం



మాట్లాడుతున్న రామారావు



పాల్గొన్న సంఘ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(రైతు సంఘం బ్యాంకు) సభ్యులకు 2023–24 సంవత్సరానికి గాను 7.5 శాతం డివిడెంట్ ప్రకటించినట్లు సంఘ పర్సనల్ ఇన్‌చార్జ్ డి.ఎ.వి.రామారావు తెలిపారు. సంఘ కార్యాలయంలో మహాజన సభ శనివారం జరిగింది. అంతకుముందు సంఘం వ్యవస్థాపకుడు స్వర్గీయ వి.వి.రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకూ లాభాల బాటలో నడుస్తుందన్నారు. సభ్యుల సహకారంతో సంఘం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు విల్లూరు రాము, కె.వి.సూర్యనారాయణ, విల్లూరి శివసూరి, కొణతాల రామ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



ఎన్టీఆర్ క్రీడామైదానంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు



ఖో-ఖో ఆడుతున్న విద్యార్థులు

200 మంది బాలబాలికలు హాజరు

అనకాపల్లి: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి, కశింకోట మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల మండల స్థాయి గేమ్స్‌లో గెలుపొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది బాలబాలికలు హాజరయ్యారు. తొలిరోజు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. ప్రశాంతమైన వాతావరణంలో పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు లెక్కల రమణ, శ్రీను, ఉమాశంకర్, దేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా కోటాలో ఆర్మీ ఉద్యోగం సాధిస్తా



నేను పదో తరగతి చదువుతున్నా. ఖో-ఖో అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం.. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ప్రకాశం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఖో-ఖో పాటీల్లో గెలుపొంది సర్టిఫికెట్ పొందాను. జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనాలని ఉంది. క్రీడా కోటాల్లో ఆర్మీ ఉద్యోగం సాధించాలని ఉంది.

– దుర్గాభాను ప్రసాద్, కన్నూరుపాలెం హైస్కూల్, కశింకోట మండలం

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చూపిస్తా



గతంలో శ్రీకాకుళంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో తృతీయ స్థానం సాధించాం. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఉంది. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది వారణాసిలో నిర్వహించిన ఖో-ఖోలో ప్రతిభ కనబర్చాను. క్రీడా కోటాలో పోలీస్ ఉద్యోగం సాధిస్తానని నమ్మకం ఉంది.

– కనుబుద్ది లహరి, 10వ తరగతి, తుమ్మపాల హైస్కూల్, అనకాపల్లి మండలం

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా



మండల స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందాను. నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. కబడ్డీ గ్రామీణ క్రీడ కాబట్టి సత్తా చాటుతున్నాను. నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– బి.మానస, కొత్తపల్లి హైస్కూల్, కశింకోట మండలం

సబ్‌రిజిస్ట్రార్‌గా జిలానీ బేగం



జిలానీ బేగం

సబ్బవరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా జిలానీ బేగం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నక్కపల్లి నుంచి సబ్బవరానికి వచ్చారు. అనంతరం తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇకపై సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల్ని నిలిపివేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ హోల్డింగ్ పట్టాల రిజిస్ట్రేషన్లనూ నిలిపివేశామన్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అందించే అన్ని రకాల సేవలను శక్తి వంచన లేకుండా అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



గవరపేటలో వినాయకుడి ఊరేగింపు



వ్యాపారవేత్తకు లడ్డూ అందజేస్తున్న కోరిబిల్లి ప్రశాంత్

కశింకోట: గవరపేటలో రజకుల వినాయక స్వామి నిమజ్జనోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ట్రాక్టర్‌పై వినాయకుని విగ్రహాన్ని నిలిపి గ్రామ వీధుల్లో యువతి యువకులు కోలాటాలు, నృత్యాల మధ్య ఊరేగించారు. బాణసంచా కాల్చారు. అనంతరం స్థానిక పెద్ద గుమ్మం వద్ద శారదానదిలో నిమజ్జనం చేశారు. సంతబయల ఎస్సీ కాలనీలో వినాయకుని మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.71 వేలకు పలికిన 100 కేజీల లడ్డూ

అనకాపల్లి: వినాయక మహోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి చిరు బస్టాప్ ఎదురుగా 35 అడుగుల వినాయకుడి వద్ద శనివారం నిర్వహించిన వంద కేజీల లడ్డూ వేలంలో రూ.71 వేలు పలికింది. దీన్ని దక్కించుకున్న వ్యాపారవేత్తకు వినాయక పందిరి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోరిబిల్లి ప్రశాంత్ లడ్డూ అందజేశారు. ఈ నెల 30న స్వామివారి నిమజ్జనోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



పెంటకోట సాయి మృతదేహం

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న బైక్‌ను నూతలగుంటపాలెం వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న యలమంచిలి మండలం షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన పెంటకోట సాయి (23) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి ఎస్ఐ మనోజ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులు పార్వతి, మాణిక్యంకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అందివచ్చిన కుమారుడి మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.